www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 21 ఫిబ్రవరి 2025
5
వైఎస్ఆర్



ప్రశాంతంగా బిఇడి పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయ పరిధిలోని బిఇడి 1,3 సెమిస్టర్ల పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 15 కేంద్రాల్లో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె. ఎస్.వి. కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడపలో ఎస్వీ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల హాల్ టిక్కెట్లు, వసతులను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 10 కేంద్రాల్లో, అన్నమయ్య జిల్లాలోని ఐదు కేంద్రాలలో తొలి రోజు 4,713 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఉదయం మొదటి సెమిస్టర్ (సప్లిమెంటరీ),మధ్యాహ్నం 3వ సెమిస్టర్ వారికి పరీక్షలు ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేస్తున్నారని, ప్రతి కేంద్రానికి అబ్జర్వర్లను నియమించమన్నారు.

ఉద్యోగ, కార్మిక సంక్షేమంపై నిర్లక్ష్యం

కార్పొరేట్ అనుకూల బడ్జెట్‌ను వ్యతిరేకించండి
వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన



బద్వేల్ : అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేస్తున్న వామపక్ష నాయకులు

ప్రజాశక్తి - బద్వేలు

జాతీయ వామపక్ష పార్టీల పిలుపుమేరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025- 26 ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సిపిఎం, సిపిఎంఎల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఎంఎల్ నాయకులు కె. శ్రీను, పి. చంద్రమోహన్‌రాజు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం మొండి చెయ్యి చూపిందన్నారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల ప్యాకేజీ, విభజన హామీలను పక్కన పెట్టిందని పేర్కొన్నారు. దగాకోరు బడ్జెట్‌ను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. వృద్ధాప్య పెన్షన్లు ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాల కోసం కేంద్ర కేటాయింపులు పెంచాలని పేర్కొన్నారు. ఆరోగ్య రంగానికి జిడిపిలో 3 శాతం, విద్యారంగానికి ఆరు శాతానికి కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఒక్క పరిశ్రమ ఏర్పాటుకు నిధులు కేటాయించి నిర్మించి ఇవ్వాలన్నారు. పెట్రోలియం ఉత్పత్తులపై సెస్‌లను, సర్ చార్జీలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని, షేక్ మస్తాన్ షరీఫ్,సగిలి రాయప్ప, చెప్పలి సుబ్బారాయుడు, గంప అంకయ్య, షేక్ ఖైరూన్‌బీ, పసుపుల మోక్షమ్మ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు జకరయ్య, నియోజకవర్గ నాయకులు రామరాజు, బాబు, సుబ్రమణ్యం, చంద్రపాల్, లూకయ్య, చెన్నయ్య, విద్యార్థి సంఘం జిల్లా నాయకులు అనిల్, బబ్లు, సిపిఎం శాఖ కార్యదర్శులు నస్సార్ బీ, ముర్రా ప్రసాద్, నరసింహ, బాలమ్మ, రత్నమ్మ, మల్లికార్జున, వెంకటసుబ్బయ్య, వెంకటపతి, వెంకటేశ్వర్లు, శ్రీను,సుబ్బారాయుడు పాల్గొన్నారు.

అట్లూరు: అట్లూరు క్రాస్ రోడ్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ 2025-2026కు వ్యతిరేకంగా నల్ల రిబ్బన్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు పి. చాంద్ భాషా, మండల పార్టీ కార్యదర్శి ఇ. రమణ మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ను 145 కోట్ల భారతదేశ ప్రజలు ఉండగా అందులో 70 కోట్ల మందిని ఈ బడ్జెట్ విస్మరించిందని పేర్కొన్నారు. రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసిన కడప ఉక్కు ఫ్యాక్టరీ ఎలాంటి నిధులు కేటాయించకుండా దగా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు దుర్గయ్య, స్వప్న, సుబ్బలక్ష్మి, తిరుపాల్ రెడ్డి, గోపయ్య, వెంకటసుబ్బయ్య, గోపయ్య పాల్గొన్నారు.

ఖాజీపేట: కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక బస్టాండ్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజశేఖర్‌రెడ్డి, లడ్డు బాషా, గౌస్, వెంకీ, అభి, నవీన్, కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ మండల మైనారిటీ నాయకులు షేక్ హాజీ గౌస్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి అన్యాయం

ప్రజలకు కష్టాలు, కార్పొరేట్లకు ఉద్దీపన పథకాలు
ప్రజల కొనుగోలు శక్తి పెంచే ప్రతిపాదనలు లేవు
కేంద్ర బడ్జెట్‌పై వామపక్షాల సదస్సులో నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి అన్యాయం చేశారని, ప్రజలకు కష్టాలు.. కార్పొరేట్లకు ఉద్దీపన పథకాలు కేటాయించారని, ప్రజల కొనుగోలు శక్తి పెంచే ప్రతిపాదనలు లేవని, నాయకులు విమర్శించారు. గురువారం స్థానిక ఆర్.కె.నగర్‌లోని సిపిఎం జిల్లా కమిటీ కార్యాలయంలో 2025 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ పై వామపక్షాల సదస్సును సిపిఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ జి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఢిల్లీలో మోడీ వికసిత్ భారత్ అంటూ బూటకపు మాటలు చెబుతున్నారే, రాష్ట్రంలో బాబు విలవిల ఆంధ్ర అంటున్నారని ఎద్దేవ చేశారు. 2025 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ ఏదారి రోజుల్లో పెట్టబోతున్నారని, ఈ బడ్జెట్లో వెనుకబడిన ప్రాంతమైన రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి, పంట కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బాబు తరచూ రాష్ట్రంలో తమది ఎన్‌డిఏ కూటమి అని పదేపదే చెప్తున్నప్పటికీ, పదేళ్లుగా విభజన చట్టం హామీలు అమలుకు కానీ, రాజధాని, పోలవరం నిర్మాణానికి కానీ కేంద్రం నుంచి గ్రాండ్ రూపంలో ఒక్క రూపాయి కూడా తెచ్చుకోలేకపోయారని విమర్శించారు. నేదస్సును ఉద్దేశించి ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచే ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వ 2025 బడ్జెట్‌లో లేవన్నారు. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ, ప్రభుత్వ ఖర్చుల్లో కోతలు పెడుతుందన్నారు. నిరుద్యోగం, ఆహార ధాన్యాల కొరత, వ్యవసాయ అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, గ్రామీణ అభివృద్ధి, ధరల పెరుగుదల అదుపు, పరోక్ష పన్నుల తగ్గింపుపై, ఉద్యోగుల, కార్మికుల పెంపు, వృద్ధులు, వికలాంగుల, మహిళల సంక్షేమం, ప్రజా పంపిణీ వ్యవస్థలను బడ్జెట్లో పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. రాజ్యాంగ ఆదేశమైన ఎస్సి, ఎస్టిల జనాభా ప్రాతిపదిక పైన బడ్జెట్‌లో నిధులను భిన్నంగా, 2 శాతం నిధులు తగ్గించి కేటాయించిందని తెలిపారు. ఇది రాజ్యాంగం చట్ట విరుద్ధమైన చర్య అని చెప్పారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు ప్రతి బడ్జెట్‌లోనూ కొంత తగ్గిస్తూ ఆ పథకాన్ని లేకుండా చేయాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. ఇదే జరిగితే గ్రామీణ పేదరికం మరింత పెరుగుతుందని హెచ్చరించారు. మాట్లాడుతూ పెట్రోలు, గ్యాస్ ఉత్పత్తులపై సర్ ఛార్జీలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, సిపిఐ (ఎం.ఎల్.లిబరేషన్) జిల్లా సమన్వయ కర్త బి.ఓబయ్య, ఆర్ఎస్‌పి. రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.మనోహర్, వి.అన్వేష్, సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎం.ఎల్ .న్యూ డెమోక్రసీ), సిపిఐ (ఎం.ఎల్ .లిబరేషన్), ఆర్.ఎస్.పి., ఫార్వర్డ్ బ్లాక్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

ప్రజాశక్తి - కడప

ఈ నెల 23న నిర్వహించబోయే గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీ ఏర్పాట్లతో విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్‌లో పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై సంబంధిత లైజన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పార్ట్-1 సెషన్, మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పార్ట్-2 సెషన్ నిర్వహిస్తారని తెలిఆపరు. అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.30 గంటల నుండి 9.45 గంటల వరకు, 1.30 గంటల నుండి 2.45 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో నీటి వసతి, మరుగుదొడ్లు, అంతరాయలేని నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఎస్పి ఇ.జి. అశోక్ కుమార్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, ఎపిపిఎస్‌షి ప్రత్యేక అధికారులు కె. శారద, అసిస్టెంట్ సెక్రటరీ (మానిటోరింగ్) జె. జయంతి, ఎస్వో జె. యశోద, సునీత, జిల్లా అధికారులు, లైజన్ అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా ఇంటర్ పరీక్షలు

రానున్న ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు.గురువారం అమరావతి నుండి గ్రూప్-2,ఇంటర్ పరీక్షలు, పి4 సర్వే, వాట్సాప్ గవర్నెన్స్, ప్రజాస్పందనలు, తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కావేటి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఎస్పి అశోక్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో ఇంటర్‌నెట్, జెరాక్స్ సెంటర్‌లను మూసి వేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఒ అజరతయ్య, జిల్లా పంచాయతీరాజ్ అధికారిని రాజ్యలక్ష్మి, డిఇఒ షంషుద్దీన్, ఎపిపిఎస్‌సి అధికారులు, విద్య శాఖ, పోలీసు, ట్రాన్స్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వెలుగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు, పాల్గొన్న రైతులు

ప్రజాశక్తి-పోరుమామిళ్ల (కాశినాయన)

రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 2వేల కోట్ల ధులు కేటాయించి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి వలసలను, కరువును, ఆత్మహత్యలను అరికట్టాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పోరుమామిళ్ల రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల ఆర్‌టిసి బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడుతూ 1996వ సంవత్సరంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, ఇప్పటికి 30 సంవత్సరాలు కావస్తున్నా ఇంతవరకు ప్రాజెక్ట్ పూర్తి చేయలేదని వాపోయారు. వెలుగొండ ప్రాజెక్టుకు రూ. 400 కోట్లు అంచనా వేసి నాలుగు లక్షల 50 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని, 20 లక్షల మందికి తాగునీరు అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇన్నేళ్లు అవుతుతున్నా చెంబుడు నీళ్లు కూడా అందించలేకపోయారని వాపోయారు. వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉంటే ఈ ప్రాంత వాసుల వలసలు ఆగిపోయేవని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పరుస్తామని చెబుతున్న చంద్రబాబు నాయుడు ఇక్కడున్న వెలుగొండగకు రూ. 34 వేల కోట్లు కేటాయిస్తే ఒక్క సంవత్సరంలోనే అటు రాయలసీమలోని ప్రాజెక్టులు, ఇటు ప్రకాశం జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టు నిమ్స్ క్యారీడర్ వంటి పరిశ్రమలను స్థాపించవచ్చు అన్నారు. లోకేష్ పాదయాత్ర సమయంలో కనిగిరి ప్రాంతానికి వచ్చినప్పుడు చిన్నపిల్లల దగ్గర నుండి ప్రతి ఒక్కరు ఫ్లోరైడ్ బారినపడి మోకాళ్లలో గుజ్జు అరిగిపోయి దీనస్థితిలో ఉన్నటువంటి వారిని చూశారని, 'మీకు అండగా నేనున్నాను' అని చెప్పారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మీకు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి తాగు , సాగుకు నీరు అందిస్తానని హామీ కూడా ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టి అందులో ఒక్క రూపాయి కూడా వెలిగొండ ప్రాజెక్టుకు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఇప్పుడు ఈనెల 24న కేంద్ర రాష్ట, ప్రభుత్వాలు బడ్జెట్ ప్రవేశం పెట్టబోతున్నట్లు చెబుతున్నారు. ఈ బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు రూ. 2 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు నిరసన అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకులు యన్ .భైరవ ప్రసాద్, మహిళా సంఘం జిల్లా నాయకులు గౌసియా బేగం, రైతు సంఘం నాయకులు రవి, పూసపాటి శ్రీనివాసులు, నారాయణ, శేషయ్య నాయుడు, ప్రకాశం చిన్నయ్య ప్రసాదు, సాయి, బీబీ, మేరీ పాల్గొన్నారు.

ఎల్ఐసిలో నూతన నియామకాలు చేపట్టాల్సిందే



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఎల్ఐసిలో ఏడేళ్లలో 15 వేల మంది ఉద్యోగులు తగ్గారని, సంస్థ కోసం పాలసీదారుల కోసం తక్షణం నూతన నియామకాలు చేపట్టాల్సిందేనని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం డివిజనల్ కార్యాలయం ఎదుట డివిజన్ అధ్యక్షుడు అవధానంన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఒక గంట దేశవ్యాప్త సమ్మె కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇన్సూరెన్స్ రంగం రూపరేఖలు మారిపోతున్న దశలో, నూతన తరం పాలసీదారుల ఆకాంక్షల మేరకు పనిచేయాలంటే ఉన్నత విద్యావంతులైన, హైటెక్ పరిజ్ఞానం ఉన్న యువత నూతన ఉద్యోగులుగా నియమించుకోవాల్సిన అవసరం ఎల్ఐసి కి ఉందని అన్నారు. జవాబుదారీతనం లేని అవుట్ సోర్సింగ్ స్థానంలో రెగ్యులర్ నియామకాలే పరిష్కారమన్నారు. యుపిఎస్‌సి తరహాలో ప్రతి ఏటా ఎల్ఐసిలో అవసరమైన మేరకు నియామకాలు చేపట్టాలన్నారు. దేశంలో ఉన్న 80 శాతం ఎల్ఐసి సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న తమ సంఘం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) కు గుర్తింపు పొందిన సంఘంగా హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ల నాయకులు అక్బర్ బాషా, వసుప్రద, లక్ష్మీకాంతమ్మ, మహేశ్వర్ రెడ్డి, అయ్యవారు రెడ్డి, వారిజాతమ్మ, రాజు, పర్వీన్, రత్నకిషోర్, కుమార్, రఘు, అప్పయ్య, పద్మజ, లీలాలక్ష్మి జయచంద్ర, సాదక్, చిన్నయ్య, గౌస్, మాలతి పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : స్థానిక బ్రాంచి కార్యాలయం ఎదుట బ్రాంచ్ అధ్యక్షులు ఏ.బాలరాజు ఆధ్వర్యంలో ఒక గంట సమ్మె నిర్వహించారు. క్లాస్-1.ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు, క్లాస్-2 ప్రతినిధులు, ఏజెంట్ల నాయకులు సంఘీభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ టి.వి.సుబ్బయ్య, ఎస్.వి. కృష్ణారెడ్డి, నరసింహులు, నిర్మల, పవన్‌కుమార్ రెడ్డి, లియాఫీ అధ్యక్షులు కె. గురుశేఖర్ ఏజంట్లు, యూనియన్ల నాయకులు హరినాయక్, బ్రహ్మయ్య, కార్యాలయం సిబ్బందిపాల్గొన్నారు.



కాశినాయన : చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-కాశినాయన : జిల్లాకు వచ్చిన రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్‌ను, రాష్ట్ర డైరెక్టర్ కమలమ్మను అంబేద్కర్ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ముత్యాలప్రసాద్‌రావు, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జేష్టాది భాస్కర్, పోరుమామిళ్ల మండల జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్ ఎస్‌సి కార్పొరేషన్ ఇడి కార్యాలయంలో కలిసి వారి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు ఆయనతో మాట్లాడుతూ మాలల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని పేర్కొన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ రుణాలు నిజమైన పేదవారికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ సంస్థ రాయలసీమ అధ్యక్షులు జె.వి. రమణ, హ్యూమన్ రైట్స్ సభ్యులు జి శ్రీనివాసులు, మానవ హక్కుల సంఘం అధ్యక్షులు రాజ, నాగ, దాసరి వినయ్ కుమారి, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** కడప పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ మాల కార్పొరేషన్ చైర్మన్, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్‌ను జనసేన పార్టీ ఎన్నికల కార్యక్రమాల నిర్వహణ కమిటీ రాయలసీమ జోన్ 1 కో-కన్వీనర్ పండ్రా రంజిత్ కుమార్, నాయకులు రాజగోపాల్. శాలువాతో కలిశారు. ఆయన్ను సత్కరించి పూల బొకేతో స్వాగతం పలికారు. మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా పరిస్థితులు, జనసేన పార్టీ బలోపేతంపై, ప్రస్తుత ఎన్‌డిఎ కూటమి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

కవయిత్రి మొల్ల జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - గోపవరం : మండల కేంద్రంలోని పాఠశాలలో గురువారం తెలుగు భాషా సాహితీ మొల్ల జయంతి ఉత్సవాల ఫ్లెక్సీ బ్యానర్లను ప్రొఫెసర్ మలయవాసిని ఆవిష్కరంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొల్ల పుట్టిన గోపవరంలో ఆమె రచనలను వెలుగులోకి తెచ్చి, విశ్వవ్యాప్తం చేసి, చిరయశస్వి అయిన విద్వాన్, డాక్టర్ గానుగపెంట హనుమంతరావు అభినందనీయులని చెప్పారు. వందనీయులన్నారు. అనంతరం నిర్వహించిన పద్య పోటీలలో విజేతలైన, ఎన్ పావని (9వ తరగతి),రాజ్యలక్ష్మి (3వ తరగతి),జాహ్నవిలకు మొల్ల సాహితీ పీఠం పక్షాన నగదు, ప్రశంసా పత్రం ,పుస్తక బహుమతులను అందజేశారు. పాఠశాల సర్వతో సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సత్యానందరెడ్డిని మొల్ల సాహితీ సేవా పురస్కారంతో సత్కరించారు. కాలగర్భంలో కలిసిపోతున్న కవయిత్రి మొల్ల ఆనవాళ్లను పరిరక్షించి, భద్రపరిచి భావితరాలకు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఠం మహిళా కార్యదర్శి సూరమ్మ, ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్, కార్యవర్గ సభ్యులు గుమ్మల్ల శ్రీనివాసులు, సత్యవతి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు నాసిరకం : సిసోడియా

ప్రజాశక్తి చెన్నూరు : గత ప్రభుత్వంలో మంజూరైన పక్కాగృహాలను నాసిరకంగా నిర్మించారని రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి సిసోడియా పేర్కొన్నారు. మండలంలోని కనపర్తి లేఅవుట్‌లో ఇళ్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మంచం కూడా పడని గదులు నిర్మించారని, దీనివల్ల ప్రజాధనం వృథా అయిందని వాపోయారు. లబ్ధిదారులు ఎవరూ ఈ ఇళ్లల్లో ఉండేందుకు ఇష్టపడరని అన్నారు. కనపర్తి లేఔట్‌లో జగనన్న కాలనీలోని ఇళ్లన్నీ ఎవరికి పనికి రాకుండా పోయాయని పేర్కొన్నారు. నాసి రకం పనుల వల్ల ప్రజాధనం అయిందని పేర్కొన్నారు. కాలనీలో సిమెంట్ రోడ్లు, డ్రైయినేజీ వంటివి సక్రమంగా లేవన్నారు. అంతకుముందు ఆ తహశీల్దార్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట కడప ఆర్‌డిఒ, తహశీల్దార్ సరస్వతి, డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, సర్వేయర్ సోమశేఖర్, విఆర్ఒ వినోద్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

వచ్చే ఏడాది సాగులోకి లక్ష ఎకరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కమిటీల (డబ్ల్యుడిసి)ను సమర్థవంతంగా నిర్వహిస్తూ అనుబంధ శాఖల సమన్వయంతో వచ్చే ఏడాదికి జిల్లాలో లక్ష ఎకరాలను సాగుబడిలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి డ్వామా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో డిడబ్ల్యుసి - పిఎంకెఎస్‌వై 2.0 (వాటర్ షెడ్ డెవలప్మెంట్ కమిటీ) ద్వారా జిల్లాలో చేపడుతున్న వివిధ రకాల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాటర్ షెడ్లు, ఫారం పాండ్లు, ఇంకుడు గుంతలు, స్టార్మ్, రైన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ద్వారా సమీప నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుతో మెట్ట భూములను సాగులోకి తీసుకురావాలన్నారు. వ్యవసాయంలో అంతర్భాగమైన ఉద్యాన, ప్రకృతి సాగు, పాడి, మత్స్య సంపదను గ్రామాల్లో అభివృద్ధి చేసే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. సమావేశంలో డ్వామా పీడీ అదిశేషారెడ్డి, సిఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్.వి, ప్రవీణ్ కుమార్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, ఉద్యాన శాఖ డిడి సుభాషిణి, పశుసంవర్ధక శాఖ అధికారులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం బిసి, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరు ప్రక్రియ మొదలు పెట్టిందని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నిరుద్యోగులకు రుణాలకు నోటిఫికేషన్ విడుదల చేయలేదని, వారికి రుణాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయం పరిపాలనాధికరి విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ కార్పొరేషన్లు పేరుకు మాత్రమే ఉండేవన్నారు. ఐదు సంవత్సరాలలో కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు రుణాలు మంజూరు చేసింది లేదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కాస్త ఊరటనిచ్చే విధంగా బిసి, కాపు కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరుకు నోటిఫికేషన్లు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలోనూ చదువుకున్న నిరుద్యోగులున్నారని, కనీసం కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు అయితే ఉపాధి పెట్టుకోవటానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

ప్రజాశక్తి- చింతకొమ్మదిన్నె : రైతులను ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు, ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త జి. ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వ్యవసాయ పరిశోధన స్థానంలో శిక్షణ, ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మరిన్ని విస్తరణ సేవలతో పాటు ప్రకృతి వ్యవసాయం వైపు ఆకర్షించేటట్లు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు వీరయ్య, డాక్టర్ అంకయ్య కుమార్, మంజుల, సీనియర్ శాస్త్రవేత్త, పాల్గొన్నారు.

సామాజిక న్యాయం అందుబాటులోకి రావాలి

ప్రజాశక్తి - కడప : పేదరికం, లింగం, శారీరక వివక్షత, నిరక్షరాస్యత, మతపరమైన వివక్షను తొలగించడానికి సామాజిక న్యాయం అందుబాటులోకి రావాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు అన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే కడప నగరం చెమ్మమియాపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 'ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం' సందర్భంగా గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు

సంక్షేమాన్ని వేగవంతం చేయాలి

ప్రజాశక్తి -కడప సిటీ



మాట్లాడుతున్న వి.ఖాదరయ్య

దూదేకుల సంక్షేమాన్ని వేగవంతం చేయాలని దూదేకుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వి.ఖాదరయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఎర్రముక్కపల్లిలోని దూదేకుల భవనంలో నూతన కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దూదేకులు సామాజిక ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. సమాజంలో ఉన్నతంగా ఎదిగిన దూదేకులు మిగిలిన దూదేకుల సమాజానికి చేయూతను అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందరూ ఎదిగితేనే సామాజిక గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం రిటైర్డు ఎంపిడిఒ వెంకటప్రసాద్ మాట్లాడుతూ సాఫ్ట్ వేర్. ఇంజినీర్, విద్య, వైద్య రంగాలలో రాణించిన వ్యక్తులు సమాజానికి తన వంతు సహాయాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం దూదేకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆయిల్ మిల్ ఓబులేసు, మహబూబ్ బాషా మాట్లాడుతూ దూదేకుల సంక్షేమానికి అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. రిటైర్డు ఉపాధ్యాయులు సుభాన్, టీచర్ అజ్మతుల్లా మాట్లాడుతూ సంఘాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సాంస్కృతిక రంగాలైన ఖత్నా, ఇఫ్తార్, పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల ప్రోత్సాహకాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. దూదేకుల భవన అబివృద్దిని వేగవంతం చేయాల్సిన బృహత్తర బాధ్యత అందరిపైనా ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నూతన దూదేకుల సంఘం కార్యవర్గ సభ్యులతోపాటు పలువురు దూదేకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-చెన్నూరు : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని కెనరాబ్యాంకు ఎఫ్ఎల్‌సిసి వీర ప్రసాద్ పేర్కొన్నారు. ఆర్థిక నేరాలపై గురువారం పొదుపు సంఘాల మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకుల్లో డబ్బు దాచుకోవడం, సకాలంలో రుణాలు చెల్లించడం, సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో ఆర్థిక నేరాలు ఎక్కువ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరాలు జరిగిన తక్షణమే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు తక్షణ ఫిర్యాదు చేయాలని చెప్పారు. అపరిచిత ఫోన్ కాల్స్ పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని, ఒటిపిలను వ్యక్తిగత సమాచారం షేర్ చేయరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెలుగు సిసి విజయమ్మ, కెనరా బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ కృష్ణారెడ్డి, హెడ్స్ సంస్థ అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్, విడ్స్ ప్రతినిధి ప్రసాదు, మహిళా సంఘాలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'అన్నమాచార్య' అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో సహాయ ఆచార్యుడిగా పనిచేస్తున్న పి. మల్లికార్జునకు హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. జోహార్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ పి. ప్రసన్న పర్యవేక్షణలో 'థర్మల్ లోడ్ మేనేజ్మెంట్ ఫర్ టెన్త్ క్లాస్ మెసేజ్ బుల్టీ ఆఫ్ ఈ ఎన్ 24, నియోనిక్ కండిషనల్' అనే అంశం పై చేసిన పరిశోధనలకుగాను పి మల్లికార్జున కు డాక్టరేట్ ప్రదానం చేశారు. అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్ప గంగిరెడ్డి, వైస్ ఛాన్సలర్ ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్, ఎలక్ట్రానిక్ విభాగ అధిపతి డాక్టర్ పి.వి.ఎస్ మురళి అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.


కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి

కంటి సమస్యల పట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కంటి చూపు అనేది చాలా ముఖ్యమని, కంటి సమస్యల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా వహించాలని మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల రోడ్డులోని ఎపి ఉర్దూ గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థులకు కంటి వెలుగు పథకం కింద కంటి అద్దాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా బిటెక్ రవి విద్యార్థినులకు కంటి అద్దాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం అంధత్వ నివారణ చర్యల్లో భాగంగానే కంటి వెలుగు పథకం అమలు చేస్తోందన్నారు. కంటి సమస్య వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. టివి, సెల్‌ఫోన్ ఎక్కువగా చూడడం వంటి వాటితో ప్రస్తుతం కంటి చూపులో సమస్యలు ఎక్కువగా వస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి ఎస్వీ జయరామిరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, రజనీకాంత్‌రెడ్డి, రామగంగిరెడ్డి, మహమ్మద్, వీరబద్ర, మడక శ్రీనివాసులు, వేమా కుమార్, డక్కా రమేష్, గోగుల మల్లికార్జున, ఎద్దుల కొండ్రాయుడు, పివి రమణ, రెడ్డి కిషోర్, రామకృష్ణారెడ్డి, డాక్టర్. కరీముల్లా జబిబుల్లా, పాఠశాల సిబ్బంది, టిడిపి నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా జగన్ కోరితే సిఎం చంద్రబాబుతో కలిపిస్తా

పులివెందుల నియోజకవర్గంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే హోదాలో జగన్‌మోహన్ రెడ్డి కోరితే ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిపిస్తానని మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఉర్దూ గురుకుల పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందులకు ఉప ఎన్నిక రావడం ఖాయమన్నారు. కుటుంబ సమస్యలు, వివేకానంద రెడ్డి హత్య కేసుకు చెందిన అనేక సమస్యలతో జగన్‌రెడ్డి కొట్టుమిట్టుతున్నాడని చెప్పారు. ఎమ్మెల్యేగా పులివెందుల సమస్యలపై బాధ్యత కూడా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తనకు స్నేహితుడిగా ఉన్నప్పటికీ.. అతనికి తనకు కొన్ని విబేధాలు ఉన్న విషయం వాస్తవమేనని తెలిపారు. టిడిపి నాయకులకు, కార్యకర్తలకు ఇబ్బందులు లేకుండా కలిసి పని చేస్తామన్నారు. త్వరలో అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు.

ప్రతి జీవికి కంటి చూపు ముఖ్యం

ముద్దనూరు : సమాజంలో నివసించే ప్రతి ఒక్క జీవికి కంటి చూపు ముఖ్యమని కొండాపురం పిహెచ్‌సి నేత్ర వైద్యాధికారి జివి లక్ష్మీదేవి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు ఆవుల శ్రీనివాసులు అధ్వర్యంలో వైద్యాధికారి విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు.

ప్రభుత్వం భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

- జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



ప్రభుత్వం భాషాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింక సుబ్రహ్మణ్యం కోరారు. శుక్రవారం అంత ర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు అవు తోందని, భాషాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు ఏమి తీసుకోలేదన్నారు. అధికార సంఘాన్ని పునరుద్ధరించి జిల్లాలో అధికార సంఘ సభ్యులను నియమించి భాషాపరమైన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. భాష వికాసానికి తోడ్పాటు నందించాలని ఆయన సూచించారు. తెలుగు అకాడమీని సంస్కృత అకాడమీతోపాటు వేర్వేరుగా నియమించి రచయితలు, కవులను ప్రోత్సహించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అకాడమీ పక్షాన అనేక పుస్తకాలను ముద్రించి యువతలో భాషాభివృద్ధిని పెంపొందించాలన్నారు. గ్రంథాలయ సంస్థ కొత్త పాలక మండళ్లను నియమించాలన్నారు. 2013, 2022 మినహా ఇప్పటివరకు పుస్తకాలను కొనుగోలు చేయలేదన్నారు. గ్రంథాలయానికి ప్రాధాన్యత ఇచ్చి ప్రతి ఏటా పుస్తకాలు కొనుగోలు చేయాలన్నారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని రాష్ట్రంలో నెలకొల్పడమే కాకుండా రచయితల పుస్తకాలకు చేయూతనిచ్చి ఆర్థిక సహాయాన్ని అందించాలన్నారు. కవులు రచయితలను ప్రతి ఏటా అవార్డులతో సత్కరించాలన్నారు. 2014 తర్వాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగలేదన్నారు. తెలుగు భాష సంస్కృతి వారసత్వాన్ని భావితరాలకు అందించాలన్నారు. ఐదవ తరగతి వరకు మాతృభాష బోధనాన్ని తప్పనిసరి చేయాలని జింక సుబ్రమణ్యం కోరారు.

అమెరికా దుశ్చర్యకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అమెరికా నుంచి వందలాది మంది భారతీయులని బహిష్కరించి, వారిని యుద్ధ విమానాల్లో తీసుకు రావడాన్ని ఖండిస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం పాత బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ మాట్లాడుతూ అమెరికాలో వలసదారులుగా ఉన్న భారతీయులను కాళ్లు చేతులకు సంకెళ్లు వేసి యుద్ధ ఖైదీల్లా పంపించడం తగదన్నారు. విశ్వ గురువుగా చెప్పుకుంటున్న మోడీ అమెరికా పర్యటన వెళ్లి వచ్చాక కూడా భారతీయులకు సంకెళ్లు ట్రంప్ సర్కార్ వేసిన ఘటన దారుణమన్నారు. ప్రధాని మోడీ అనుసరించిన ఆర్థిక విధానాల నిరుద్యోగాన్ని పెంచాయన్నారు. అందువల్లే నిరుద్యోగం గణనీయంగా పెరిగి భారత దేశ యువత వలస వెళ్తున్నారన్నారు. వికసిత్ భారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏమాత్రం సరిపోదన్నారు. అమెరికాలో భారతీయుల పట్ల అమెరికా దుశ్చర్యను కనీసం ఖండించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్‌కళ్యాణ్, అరుణ్, శశి, బన్ని, జగన్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థానంలో గురువారం మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ ఇఒ శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, అర్చకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలను ఈనెల 26, 27న ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేపడతామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

హంస వాహనంపై వీరభద్ర స్వామి దర్శనం

అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా పది రోజులపాటు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండోరోజు గురువారం స్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవతో పూజలు ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ పిపి నారాయణ యాదవ్, కార్యనిర్వాహణాధికారి కె.శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఫైలేరియా వ్యాధి పట్ల జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - లింగాల

సమాజంలో ఫైలేరియా వ్యాధిని గుర్తించి వైద్యం సలహా మేరకు నివారించవచ్చునని మండల వైద్యాధికారిణి సుభాషిణి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం తాతిరెడ్డిపల్లె చెందిన ఫైలేరియా వ్యాధి బాధితులకు బోధ వ్యాధి నివారణ కిట్లను అందజేశారు. ఫైలేరియా వ్యాధి బాధితులు జాగ్రత్తలు పాటించాలన్నారు. శరీర వైకల్యాన్ని తగ్గించేందుకు ఫిజియోథెరపీ, స్వీయ సంరక్షణ, శరీర శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు కల్యాణ్ దినకర్, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సిహెచ్‌ఒ శివరాం, పిహెచ్ఎన్ కుసుమ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా అక్రమ కట్టడాలు.. పట్టని అధికారులు

ప్రజాశక్తి - ఖాజీపేట

రాజకీయ నాయకుల అండదండలు, ప్రభుత్వ అధికారుల సహకారం లభిస్తే ఎలాంటి వారైనా ప్రభుత్వ ఆస్తులను తమ సొంతం చేసుకోవచ్చు. మహా అయితే కాస్త ఖర్చవుతుంది. రాజకీయ అండ దండలు కలిగిన వ్యక్తులైతే కాస్తోకూస్తో ఖర్చు కూడా తక్కువే. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకోవాలన్నా, ప్రభుత్వ భవనాలు సొంతం చేసుకోవాలన్నా ఖాజీపేట మండలంలో చాలా సులువుగా అవకాశం ఉంటుంది. వివరాల్లోకి వెళితే.. పుల్లూరు పంచాయతీలో పిడబ్ల్యుడి బంగ్లా సమీప ప్రాంతంలో ప్రధాన రహదారికి ఇరువైపులా అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో రోడ్ల భవనాల శాఖ స్థలాలు, నీటిపారుదల శాఖ, పంచాయితీ రాజ్ శాఖకు చెందిన స్థలాలు చాలానే ఉన్నాయి. ఈ ప్రాంతం వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతుండడంతో ప్రయివేట్ వ్యక్తులు కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టి తమ సొంత ఆస్తిలా భావిస్తున్నారు. కొందరు రూ.లక్షలతో రూములు నిర్మించి అద్దెకిస్తూ ఆదాయం గడిస్తున్నారు. ఈ తతంగమంతా ప్రభుత్వ శాఖల అధికారులకు తెలిసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. రాజకీయ నాయకుల అండ దండలు, అధికారుల ప్రోత్సాహంతోనే అక్రమ కట్టడాలు జోరుగా అందుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్ని నెలల క్రితం అక్రమ కట్టడాల వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా ఎన్నికల సమయం కావడంతో చర్యలు తీసుకోలేకపోయారు. ప్రభుత్వ ఆస్తులు కళ్ల ముంగిట పరాధీనమవుతున్నా చర్యలు తీసుకోకపోవడం వెనుక అధికారుల తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. అక్రమ కట్టడాల తర్వాత విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ అనధికారికంగా అనుమతులు ఇస్తూ ఆక్రమణదారులను ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా పరిరక్షించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం వెనుక అవినీతి కారణమని ప్రజలు బాహటంగానే ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి, పిఆర్, నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి అక్రమ కట్టడాల నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ఆర్అండ్‌బి స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణం

రైతులకు అన్యాయం చేస్తున్న దాల్మియా యాజమాన్యం : ఎమ్మెల్సీ


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దాల్మియా వారు సహకరించిన రైతులకే అన్యాయం చేస్తున్నారని వారు తిరగబడితే పరిస్థితులు మరోరకంగా ఉంటాయని వైసిపి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి హెచ్చరించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ దాల్మియా పరిశ్రమ నిర్మాణం వల్ల గ్రామస్తులకు, రైతులకు నష్టం వాటిల్లుతోందన్నారు. దాల్మియా చుట్టుపక్కల ఉన్న పొలాలు వ్యవసాయానికి పనికిరాకుండా దుమ్ము ధూళితో పూర్తిగా పంటలను కప్పేస్తుందన్నారు. దుగ్గనపల్లి, నవాబుపేట, చిన్న కొమెర్ల గ్రామాలపై దుమ్ము పడి అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. దాల్మియా వారు బ్లాస్టింగ్ చేయడంతో నవాబుపేటలో ఇళ్లు కూలిపోయే పరిస్థితి ఉందన్నారు. దాల్మియా అధికారులు ఉన్నత స్థాయి అధికారులకు తప్పుడు రిపోర్టు అందిస్తూ ఉన్నారన్నారు. ఇరిగేషన్ అధికారులు దాల్మియా నిర్మాణానికి ఇది సరైన ప్లేస్ కాదని రిపోర్ట్ ఇచ్చారన్నారు. లోకాయుక్త కూడా ఇక్కడికి వచ్చి సర్వే చేసిందన్నారు. రెవెన్యూ అధికారులు కూడా గతంలో తప్పుడు నివేదిక ఇచ్చారని లోకాయుక్త చెప్పిందన్నారు. దుగ్గనపల్లి గ్రామంలోని 50 ఎస్సీ కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. మీడియా వారైనా ఉన్నతస్థాయి అధికారుల కళ్లకు కనపడేలా కథనాలను ప్రచురింపజేయాలన్నారు. వైసిపి రైతులకు అండగా ఉంటూ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. దాల్మియా వారు అహంకారాన్ని వీడి న్యాయబద్ధంగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శివగురివి రెడ్డి, నవాబుపేట వైసిపి నాయకుడు భాస్కర్‌రెడ్డి, చిన్నకొమెర్ల జగన్మోహన్‌రెడ్డి, పెద్దముడియం, మైలవరం మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అందరికీ చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కడప మహిళా పోలీస్‌స్టేషన్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ ఇదురు బాషా పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, బాలలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో చోటు చేసుకుంటున్న సంఘటనల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. చెడుకు దూరంగా, మంచికి దగ్గర ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎలాంటి ఆకర్షణలకులోను కాకుండా ప్రలోభాలకు గురి కాకూడదన్నారు. ఫోక్సో చట్టం, ఈవ్ టీజింగ్, బాల్యవివాహాల గురించి విద్యార్థులకు వివరించారు. ఎంఇఒలు నాగస్వరలత, సత్య నాగరాజు మాట్లాడుతూ కౌమార దశలో పిల్లలు ఆకర్షణకు లోనవుతుంటారని, జాగ్రత్తగా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు పిల్లలకు ప్రత్యేకంగా బాలల న్యాయ చట్టం ఉందన్నారు. సమస్యలు ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కి ఫోన్ చేసి సహాయం పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుజాతమ్మ, మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి పుల్లగూర విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్



18వ రోజు రిలే నిరాహార దీక్షల్లో పశువైద్య విద్యార్థులు

ప్రభుత్వం స్పందించే వరకూ దీక్ష విరమించం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

స్టయిఫండ్‌పై ప్రభుత్వం స్పందించే వరకు దీక్ష విరమించేది లేదని పశువైద్య విద్యార్థులు తేల్చి చెప్పారు. ఆ మేరకు పశు వైద్య విద్యార్థులు శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారానికి 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్‌ను మరింత గట్టిగా వినిపించేందుకు విద్యార్థులు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. 13ఏళ్లుగా పశు వైద్య విద్యార్థుల స్టయిఫండ్ రూ.7,000గానే కొనసాగుతోందన్నారు. ఈ కాలంలో అన్ని రంగాల్లో ఇన్ఫలేషన్ పెరిగినా, ఇతర ప్రొఫెషనల్ కోర్సు లకు సంబంధించి విద్యార్థుల స్టయిఫండ్ పెరిగినా పశు వైద్య విద్యార్థులకు మాత్రం అలాగే ఉందన్నారు. ప్రభుత్వం వీలైన త్వరలోనే స్పందించి స్టయిఫండ్ పెంపుదలకు తగిన చర్యలు తీసుకుంటుందనే ఆశతో విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

సమతా కుంభ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

హైదరాబాద్ షాద్ నగర్‌లో జరిగిన సమతా కుంభ్‌లో చైతన్య పూరిత ప్రదర్శనలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. గురువారం పాఠశాల అవరణలో ప్రతిభ చూపిన విద్యార్థులను చక్రపాణిరెడ్డి అభినందించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో ఈ నెల 9 నుండి 19 తేదీ వరకు జరిగిన సమతా కుంభ్–2025 మహోత్సవంలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. తమ విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శన ఒక అద్భుత ఘట్టంగా నిలిచిందని తెలిపారు. ఈ ఉత్సవాన్ని సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్, జీయర్ ఛానల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తమ పాఠశాల విద్యార్థులు హాజరైనందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఒలంపియాడ్‌లో 'నలంద' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జాతీయ స్థాయి ఇంగ్లీషు ఒలంపియాడ్‌లో నలంద పాఠశాల విద్యార్థులు 17 మంది బంగారు పతకాలు సాధించారని కరస్పాండెంట్ డాక్టర్ సోమేశ్వరారెడ్డి తెలిపారు. ఆ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఒలింపియాడ్ పరీక్షల్లో తమ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. తద్వారా విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కలుగుతుందని ప్రిన్సిపల్ వెంకటస్వామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ విజిత, హెడ్మాస్టర్ సర్వేశ్వరి పాల్గొన్నారు.

పిల్లల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, ఆంధ్రుల అభ్యాస పరివర్తన కార్యక్రమంలో భాగంగా సమగ్రాభివృద్ధి సాధనలో పిల్లల్లో అభ్యాసన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సిడిపిఒ సునీత పేర్కొన్నారు. చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అంగనవాడీ కార్యకర్తలు, మండలస్థాయి ఆర్‌పిలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిడిపిఒ, ఎంఇఒ జాఫర్ సాదిక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిక్షణ ఈనెల 25 వరకు ఉంటుందన్నారు. శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లోని విద్యార్థులకు అమలు చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు సుహాసిని, సుభద్ర, ప్రధానోపాధ్యాయుడు రామాంజులు, ఉపాధ్యాయుడు శివారెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

హెచ్ఐవి అంటించుకునే వ్యాధి

ప్రజాశక్తి - చాపాడు

హెచ్ఐవి అంటు వ్యాధి కాదు.. అంటించుకునే వ్యాధి అని డాక్టర్ కావ్యమాధురి తెలిపారు. మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో గురు వారం చైల్డ్ ఫండ్ ఇండియా స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవి, టిబిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యాధి వ్యాపించు మార్గాలను, నివారణలను గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవి టిబిగా మార్పు చెందే అవకాశం ఉందన్నారు. జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్ఐవి పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ రాఘువయ్య, సిహెచ్ఒ కీర్తి, లింక్ వర్క్ స్కీం సూపర్వైజర్ దర్బార్‌వల్లి, ఎఎన్ఎం సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్‌ను వేధించడం మానుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


మాట్లాడుతున్న సత్యనారాయణ

గోపవరం పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్‌ను టిడిపి గల్లీ నాయకుడు వేధించడం మానుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, కార్యదర్శి విజయ్ కుమార్ సూచించారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ టిడిపి నాయకుడు సుమారు 6 నెలల నుండి అంగన్వాడీ వర్కర్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. అంగన్వాడీ వర్కర్ 20ఏళ్ల నుంచి పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయి ఉద్యోగంలో చేరారని వివరించారు. జిఒ ప్రకారం సెలెక్ట్ చేసామని ఆమెకు నోటీసులు ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నించడం సరికాదన్నారు. అనాలోచితంగా ముందుకెళ్తే ఆందోళన కార్యక్రమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. గత ప్రభుత్వానికి పట్టిన గతే ప్రస్తుత ప్రభుత్వానికి కూడా పడుతుందన్నారు. సమావేశంలో ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, మున్సిపాలిటీ యూనియన్ కార్యదర్శి సాల్మన్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చని వేదవ్యాస డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని వాసవి కల్యాణ మండపంలో గురువారం వేదవ్యాస కాలజి డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ డిగ్రీ తర్వాత సాఫ్ట్వేర్ రంగంతోపాటు ఐఎఎస్, ఐపిఎస్, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో రాణించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. తల్లిదండ్రుల గౌరవాన్ని నిలబెట్టాలని తెలిపారు. కళాశాల అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. అధ్యాపకులు సుబ్బయ్య, కోదండపాణి మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో జరిగే క్యాంపస్ ప్లేస్మెంట్స్ ఉద్యోగాలు సాధించి వేదవ్యాస డిగ్రీ కళాశాలకు జిల్లాస్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు. మాదాసు మురళి మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో నాగరాజు, యాసిన్, రామలక్ష్మిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సి.ఆది నారాయణరెడ్డి

రాష్ట్రాభివృద్ధికి జగన్ చేసిందేమీలేదు


ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రాష్ట్రాభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిందేమీలేదని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సి.ఆదినారాయణ రెడ్డి విమర్శించారు. వామికొండ సర్వారాయ ప్రాజెక్ట్ నీరు లీకేజీతో సమీప గ్రామాల ప్రజల ఇబ్బందులను తీర్చేందుకు మాదన్నగారి పల్లెలో గురువారం రైతులు, అధికారులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రగుంట్ల పట్టణంలో టిడ్కో ఇళ్లు, తాగునీరు, కళాశాల భవనాలు వంటి సమస్యలున్నా జగన్ పట్టించుకోలేదన్నారు. అమరావతి, పోలవరం, వైజాగ్ రైల్వేజోన్‌లకు బ్రేక్ కొట్టారని అన్నారు. వైజాగ్ స్టీల్ కోసం ప్రయత్నించలేదన్నారు. స్థానికంగా వామికొండ సర్వారాయ ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. ఈ ప్రాజెక్టు నీటిని కాలువ ద్వారా పెదనపాడు, వలసపల్లె, తుమ్మలపల్లె, సిరాజుపల్లె, దండుపల్లె, కర్మకుంటపల్లె, రంగసాయిపురం, చిలంకూరు, నిడ్జీ గ్రామాలకు సంబంధించి పదివేల ఎకరాలకు నీరు అందుతుందని వివరించారు. కాలువ సమస్య పరిష్కారానికి రైతులతో మాట్లాడేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వంతో చర్చించి ప్రాజెక్టు క్యాన్సిల్ అవకుండా ఆపానని తెలిపారు. రైతులు, కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుంచి డబ్బు రావాల్సి ఉందని, ఇప్పించేందుకు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. మార్చి ఒకటి నుంచి జూన్ 15లోపు 100 రోజుల ప్రణాళికతో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, టిడిపి నాయకులు కత్తి ప్రతాప్‌రెడ్డి, కాంట్రాక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో విఫలం

ప్రజాశక్తి - వేంపల్లె

రైతులను ఆదుకోవడంలో వైసిపి, టిడిపి రెండు పార్టీలూ విఫలమయ్యాయని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి, టిడిపి రైతుల విషయంలో దొందూదొందే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతుల కోసం అనేక పథకాలు అమలు చేశాయని చెప్పారు. హరిత విప్లవం, వ్యవసాయ రుణాల మాఫీ, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట రుణాలు, వడ్డీలేని రుణాలు, పావలా వడ్డీ రుణాలు, డ్రిప్ ఇరిగేషన్, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, గిట్టుబాటు ధర కల్పించడం వంటి అనేక పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. వ్యవసాయం పండుగ కావాలి అనే రీతిలో కాంగ్రెస్ పాలనలో పథకాలు అమలయ్యేవని తెలిపారు. క్వింటాల్ బుడ్డ శనిగ రూ.10వేలు చొప్పున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.


కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న కౌన్సిలర్లు

సమస్యల్ని పరిష్కరించాలని కౌన్సిలర్ల వినతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు కౌన్సిలర్లు గురువారం మున్సిపల్ కమిషనర్ శేషఫణికి వినతిపత్రమిచ్చారు. ఒకటవ వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని పరిష్కరించాలని కోరారు. రెండో వార్డు వైసిపి నాయకులు వెర్రా డేవిడ్, 20వ వార్డు కౌన్సిలర్ అలీ, ఒకటో వార్డు కౌన్సిలర్ మోపూరి ప్రశాంత్ మాట్లాడుతూ వార్డు సమస్యలపై అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రకాష్ నగర్‌లో నీటి పైప్‌లైన్లు, రోడ్లు, కరెంటు సమస్యలు ఉన్నాయని వివరించారు. పందులు ఎక్కువగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కమ్యూనిటీ హాలుకు మరమ్మతులు చేయలేదన్నారు. రాణివనంలో పాత స్టేట్ బ్యాంకు సమీపంలో నాలుగేళ్లుగా పైప్‌లైన్ లీక్ అవుతోందన్నారు.

త్వరలో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానికంగా ప్రొద్దుటూరు రోడ్డులో నిర్మించిన టిడ్కో ఇళ్లను మరో నాలుగు నెలల్లో లబ్ధిదారులకు ఇవ్వనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ శేషఫణి తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ టిడ్కో ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. వారానికి 40 మందికి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు. మొత్తం లబ్ధిదారులు 1,545 మంది ఉండగా, ఇందులో 768 మందికి రిజిస్ట్రేషన్ అయిపోయిందన్నారు. గత ప్రభుత్వంలో 599 మందికి రిజిస్ట్రేషన్ అయ్యాయని తెలిపారు. పెద్ద నీటిట్యాంకు, సిసి రోడ్లు, డ్రయినేజీ, పైప్‌లైన్‌తో పాటు కనీస వసతుల పనులు జరుగుతున్నాయని వివరించారు. లేఅవుట్లకు సంబంధించి ఇంటింటికి కులాయి కనెక్షన్ ఇచ్చే పైప్‌లైన్ వర్క్ రూ.2కోట్లతో జరుగుతోందన్నారు. పట్టణంలో రూ.3కోట్లతో పాతవాటి స్థానంలో కొత్త నీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని కమిషనర్ తెలిపారు.

తప్పులు సవరించాకే మెయిన్స్ నిర్వహించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రవ్యాప్తంగా 92,250 మంది గ్రూప్–2 అభ్యర్థులకు రోస్టర్ విధానంలో జరిగిన తప్పులను సవరించాకే మెయిన్స్ ఎగ్జామ్ ఈనెల 23న నిర్వహించాలని, జిఒ నెంబర్ 77ను ఏమాత్రం సడలింపు లేకుండా నిబంధనలను తప్పక పాటించాలని ఎపి రాష్ట్ర అభివృద్ధి వేదిక స్టేట్ కన్వీనర్ గంజికుంట నాగరాజు కోరారు. కడప కలెక్టరేట్‌లో గురువారం ఆయన నిరుద్యోగులతో జిల్లా డిఆర్‌ఒకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫ్యాక్స్ ద్వారా సమాచారాన్ని ఇచ్చి జిల్లాలో ఉన్న నిరుద్యోగులకు అండగా ఉంటామన్నారు.

ఎస్ఆర్ఐటిలో ల్యాబ్ మాన్యువల్స్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ హెచ్‌ఒడి సురేష్ బాబు, ఈఈఈ హెచ్‌ఒడి డాక్టర్ ఎ.వేంకటేశ్వరరెడ్డి, మెకానికల్ హెచ్‌ఒడి బి.నారాయణరెడ్డి, ఈసిఈ హెచ్‌ఒడి డి.శివ, సి.ఎస్.ఈ హెచ్‌ఒడి వై.సుబ్బారెడ్డి, హెచ్‌ఒడి రాజశేఖర్‌రెడ్డి ఐఎస్‌బిఎన్ నెంబర్‌తో ల్యాబ్ మాన్యువల్స్ పబ్లిష్ చేశామని ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. వీటిని కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డిచే ఆవిష్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

హైదరాబాద్ నుంచి తిరుపతి వస్తున్న హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్న అర్జున్ ప్రమాదవశాత్తు రైల్లో నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. ముద్దనూరు 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అర్జున్ హరిప్రియ ఎక్స్‌ప్రెస్ రైల్లో తిరుపతి వస్తుండగా.. రైలు ఉదయం చింతకుంట గ్రామ సమీపం వద్ద రాగానే అర్జున్ ప్రమాదవశాత్తు రైల్లో నుంచి కింద పడ్డాడు. గమనించిన రైతులు 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.